

పండక్కి వస్తానంటివే.!

పండక్కి ఇంటికి వచ్చేస్తానమ్మా..మీకు కావాల్సినవి తీసుకువస్తా అని చెప్పిన మా నాన్న ఎందుకు చనిపోయాడు అంటూ పిల్లలు ఏడుస్తున్న తీరు పలువురిని కలచివేసింది. -8లో



సంక్రాంతికి ఊరెళ్తున్నారా..!

చాలా మంది సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లే వారు తమ ఇంటి విషయంలో, ప్రయాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.110	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 138 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఎస్పీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్ సెల్ కార్యక్రమం రద్దు

రాయచోటి: అన్నమయ్య జిల్లా, రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్‌సెల్ కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం 13వ తేదీన భోగి పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి కార్యక్రమానికి రావొద్దని కోరారు.

సిద్దవటం రేంజిలో కూంబింగ్



కూంబింగ్ నిర్వహిస్తున్న రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం: సిద్దవటం రేంజిలోని రోళ్ళబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్టు బీట్లలో తన సిబ్బందితో కూంబింగ్ నిర్వహించామని రేంజర్ కళావతి తెలిపారు. శనివారం రేంజర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లా డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం సమస్యాత్మక ప్రదేశాల్లో ఎర్రచందనం స్మగ్లర్ల కోసం స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అటవీ సమీప గ్రామాల ప్రజలకు అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు తెలియజేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, గొల్లపల్లె ఎఫ్‌బీఓ మధు, రోళ్ళబోడు ఎఫ్‌బీఓ ఆది విశ్వనాథ్, సిద్దవటం ఎఫ్‌బీఓ పెంచలరెడ్డి, బేస్‌క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టాల వాకిట సంక్రాంతి!



- పల్లెల్లో కానరాని పండుగ వాతావరణం
- కరువుతో రూ.79 కోట్ల పెట్టుబడి, కష్టం మట్టిపాలు
- కూటమి ప్రభుత్వం రాగానే పాడి రైతుపై పిడుగు
- టమాటకు ధరలేక రూ.కోట్లల్లో నష్టాలు
- అన్నదాత సుఖీభవ ఇవ్వక రూ.406 కోట్లు ఎగనామం




ఫెంగల్ తుపానుకు దెబ్బతిన్న వరిపంట



వర్షాభావంతో దెబ్బతిన్న వేరుశెనగ పంట

బి.కొత్తకోట/రాయచోటి: బంధుమిత్రులు, కుటుంబాలతో కలిసి సంతోషంగా చేసుకునే పెద్దపండగ సంక్రాంతి కళ తప్పింది. సంక్రాంతి అంటేనే రైతన్న పండగ, పంటల సాగు పూర్తి చేసి దిగుబడులు విక్రస్తారు. పశువులను పూజించి జరుపుకునే ఈ పండగ కరువు వాకిట నిలిచింది. ప్రభుత్వ నిరాదరణ, సాగుచేసిన పంటకు దక్కని మద్దతు ధరతో, కష్టాల సేద్యం చేసిన రైతుల కళ్లల్లో దైన్యం తప్ప కాంతి లేదు. పాలకుల నిర్లక్ష్యంతో పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం రైతు భరోసాతో రైతన్నలను ఆదుకుంటే కూటమి ప్రభుత్వం అంతకుమించి ఆదుకుంటామంటూ మొండిచెయ్యి చూపింది. రైతులకు కష్టాలు, కన్నీళ్లు నలువైపులా చుట్టుముట్టగా సంక్రాంతి కళ తప్పింది.



పాడి రైతు కష్టం దోపిడీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమూల్ డెయిరీ ద్వారా పాడి రైతులకు అధిక ధరకు పాలసేకరణ చేయించారు. జిల్లాలోని కురబలకోట, మదనపల్లె, రామసముద్రం, రామాపురం, గాలివీడు మండలాల్లో మొదలైన పాలసేకరణ లక్ష లీటర్లకు చేరింది. ప్రస్తుతం 28వేల లీటర్లకు తగ్గిపోయింది. ఫలితంగా రైతులను డెయిరీలు నిలువుదోపిడి చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో అమూల్ డెయిరీకి ప్రేవేట్ డెయిరీలు పోటీపడి లీటర్‌కు రూ.40 నుంచి రూ.45 చెల్లించేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాల సేకరణ ధర భారీగా తగ్గించేశాయి. ప్రస్తుతం రూ.25 నుంచి రూ.35 మాత్రమే చెల్లిస్తున్నాయి. రైతులు లీటర్‌కు రూ.10 నుంచి రూ.15 నష్టపోతున్నారు.

పైసా పరిహారం లేదు

ఖరీఫ్‌లో 65,386 హెక్టార్ల సాధారణ సాగు కాగా వర్షాభావంతో సాగు సాగలేదు. వేరుశెనగ సాగు 42,852 హెక్టార్లకు 13,390 హెక్టార్లకే పరిమితమైంది. 65,386 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సివుండగా 24,396 హెక్టార్లలోనే సాగైంది. దీనితో ప్రస్తుత ప్రభుత్వమే జిల్లాలోని 19 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఇందులో 23,987 మంది రైతులు సాగుచేసిన 12,723 హెక్టార్లలో వేరుశెనగకు నష్టంవాటిల్లింది. ఎకరా సాగుకు రూ.25 నుంచి రూ.30 వేలు ఖర్చు చేయాలి. రూ.25 వేలును లెక్కించినా రూ.79.54 కోట్ల పెట్టుబడిని రైతులు నష్టపోయారు. ఈ పంట పరిహారం కోసం అధికారులు రూ.21.5 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించినా ఇప్పటివరకు పైసా మంజూరు కాలేదు. మరోవైపు ఫెంగల్ తుఫాను ప్రభావంతో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో పంటలపై ప్రభావం చూపింది. వరి 2,560 మంది రైతులకు చెందిన 1,098.3 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. దీనికి పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదించినా ఇంతవరకు అందలేదు.

రూ.406 కోట్లు ఎగ్గొట్టిన ప్రభుత్వం

అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకు రూ.20 వేలు సహాయం అందిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జిల్లా రైతాంగానికి ఇవ్వాల్సిన రూ.406.74 కోట్ల ఆర్థిక సహాయానికి ఎగనామం పెట్టింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ జనవరికి మూడు విడతల్లో చెల్లించాల్సివున్నా పైసా ఇవ్వలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చిన 2,03,374 మంది రైతులను పరిగణలోకి తీసుకున్నా పైమొత్తాన్ని అధికారంలోకి వచ్చాక అందించాలి. కాగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏటా ఖరీఫ్ ప్రారంభంలో రూ.7,500, రెండో విడత రూ.4,000, మూడో విడత రూ.2000 ఖాతాలకు జమ చేసేది. ఇలా ఐదేళ్లలో 10,08, 190 మంది రైతుల ఖాతాలకు రూ.1361.05 కోట్లు జమ చేసింది. ఇంత పెద్ద మొత్తం ఏ ప్రభుత్వంలోనూ రైతులకు లబ్ధి కలగలేదు.

మద్దతులేని టమాట

తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో టమాట అధికంగా సాగవుతుంది. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. ఈ ప్రాంత రైతులు ఏడాది పొడవునా సాగుచేసే పంట ఇది. గత డిసెంబర్‌లో టమాట ధరలు పడిపోయాయి. కిలో రూ.3-4 పలికింది. మొదటి రకం కిలో రూ.8 పలికినా పెట్టుబడి దక్కక ఇబ్బంది కలిగింది. ధర లేనప్పుడు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించడం లేదు. ఫలితంగా రైతులకు లాభాల కంటే నష్టాలే వెంటాడుతున్నాయి.

లీటర్‌కు రూ.33 ఇస్తున్నారు



నాకు రెండు పాడి ఆవులు ఉన్నాయి. రోజుకు రెండు పూటలు 15 లీటర్ల పాలు వస్తాయి. ఈ పాలను ప్రయివేటు డెయిరీకి పోస్తున్నా. లీటర్‌కు రూ.32 నుంచి రూ.33 ఇస్తున్నారు. ఇప్పుడు లీటర్‌కు 90 పైసలు పెంచారు. పాల ధర పెద్దగా పెంచలేదు. డెయిరీల మధ్య పోటీ ఉంటేనే ధర పెరుగుతుంది. ఇస్తున్న ధరకే పాలను పోస్తున్నాం. -బి.సుబ్బారెడ్డి, అంగళ్లు, కురబలకోట

నష్టపోయా..



ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశా. దీనికి రూ.60వేలు పెట్టుబడి అయ్యింది. రెండెకరాలకు పది బస్తాలే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో బస్తా రూ.1,600 పలికింది. దీన్ని విక్రయించుకుంటే రూ.16వేలు చేతికందింది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ఇచ్చి ఉంటే ఆసరా ఉండేది. జగన్ పాలనలో గత జనవరి నాటికి రూ.13,500 రైతు భరోసా సొమ్ము అందింది. -ఎం.శ్రీనివాసులురెడ్డి, కుడుమువారిపల్లె రైతు, తంబళ్లపల్లె

రూ.2 వేలు వచ్చాయి



ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. గత ప్రభుత్వంలో ప్రతిఏటా ఐదేళ్లు రూ.13,500 పెట్టుబడి సాయం అందింది. ఈ సొమ్ము పెట్టుబడికి ఆసరా నిలిచింది. ఈ ఏడాదిలో కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.2 వేలు మా ఖాతాకు జమ అయ్యింది. -ఎం.శ్రీరాములు, బిక్కావాండ్లపల్లె, పెద్దమండ్యం

కన్నీటి వీడ్కోలు







పులివెందులలో వైఎస్ అభిషేక్‌రెడ్డి అంతిమయాత్ర, పాల్గొన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

- భారీగా తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించిన ప్రజలు
- శోకసంద్రంలో మునిగిన వైఎస్ కుటుంబ సభ్యులు
- వైఎస్ అభిషేక్ పార్థివదేహం వద్ద నివాళులర్పించిన వైఎస్ జగన్ దంపతులు

సాక్షి కడప: వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి మరణం వైఎస్ కుటుంబ సభ్యులను కుంగ దీసింది. మరణ వార్త తెలిసినప్పటి నుంచి శోకసంద్రంలో మునిగిపోయారు. యుక్త వయసులో ఉన్న అభిషేక్‌రెడ్డి మరణాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగంలో పని చేస్తూ నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా అందరితో మంచి పరిచయాలు ఉండటంతో.. భారీగా అభిమానులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. పులివెందులలోని దినేష్‌మెడికల్ సెంటర్‌లో వైద్యులుగా సేవలు అందిస్తూ అనేక మంది హృదయాల్లో అత్యుత్తమ వైద్యునిగా స్థానం సంపాదించారు. చిన్న వయసులో మంచి పేరుప్రతిష్టలతో పాటు సౌమ్యునిగా గుర్తింపు తెచ్చుకున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతి చెందడంతో.. పార్టీలకు అతీతంగా నేతలు వచ్చి నివాళులర్పించారు. అనేక వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున అంబకపల్లె రోడ్డులో ఉన్న నివాసం వద్దకు వచ్చి ఆయన భౌతిక కాయం వద్ద అంజలి ఘటించారు.

'నాన్న.. లే నాన్న'



డాక్టర్‌గా ఎందరో ప్రాణాలు కాపాడిన వైఎస్ అభిషేక్‌రెడ్డి.. అక్కడ ఫ్రీజర్‌లో విగత జీవిగా ఉన్నాడు. 'నాన్న లే నాన్న' అంటూ ఆయన కుమార్తెలు వైఎస్ అక్షర, వైఎస్ అకర్ష బోరున విలపించారు. తండ్రి ఇక లేడని, పలకలేడని తెలియని పసి హృదయాల రోదన అక్కడున్న అందరినీ కలచివేసింది. -పులివెందుల రూరల్

విషణ్ణ వదనంలో వైఎస్ కుటుంబ సభ్యులు

వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతితో వైఎస్ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. అనారోగ్యంతో అభిషేక్‌రెడ్డి హైదరాబాదులోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన భౌతిక కాయాన్ని పులివెందులలోని నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజలు సందర్శించి జోహార్లు అర్పించారు. ప్రధానంగా అభిషేక్‌రెడ్డి పార్థివదేహం వద్దనే ఆయన కుమార్తెలు వైఎస్ అక్షర, వైఎస్ ఆకర్షలు నాన్న నాన్న అంటూ పిలుస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. వైఎస్ అభిషేక్‌రెడ్డికి నివాళులర్పించిన అనేక మంది కన్నీటి పర్యంతమయ్యారు. అభిషేక్‌రెడ్డి భార్య డాక్టర్ వైఎస్ సౌఖ్య ఆద్యంతం భర్తను స్మరించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెమర్చిన కళ్లతో కనిపించగా, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి కూడా కన్నీరు పెట్టుకున్నారు. మనవడి మృతితో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ పద్మావతమ్మ మొదలుకొని తండ్రి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, తల్లి మాధవి, సోదరుడు అభినవ్‌రెడ్డిలు బోరున విలపించారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జోసెఫ్‌రెడ్డి విషణ్ణ వదనంలో కనిపించారు.

ప్రముఖుల నివాళి : వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకుని భారీగా ప్రజలు తరలివచ్చి నివాళులర్పించారు. ప్రజలతోపాటు పార్టీలకు అతీతంగా నేతలు వచ్చి పుష్పాంజలి అర్పించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, తాడిపత్రి కేతిరెడ్డి పెద్దారెడ్డి, రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి నివాళులర్పించారు.

అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న స్వగృహం నుంచి వైఎస్ అభిషేక్‌రెడ్డి అంతిమయాత్ర కన్నీటి సుడుల మధ్య కొనసాగింది. పార్థికదేహం గల వాహనం ముందుగా పాస్టర్లు దేవుని వ్యాక్యాలు వినిపిస్తూ ముందుకు సాగారు. ఇంటి వద్ద నుంచి అంబకపల్లెరోడ్డు, పాత ఆర్టీసీ బస్టాండు సర్కిల్, మెయిన్‌రోడ్డు మీదుగా లయోల డిగ్రీ కళాశాల దారిలోని వైఎస్ సమాధుల తోట వరకు కొనసాగింది. అలంకరించిన వాహనంలో ఉన్న వైఎస్ అభిషేక్‌రెడ్డి పార్థివదేహంపై ఒకవైపు పూలు చల్లుతుండగా.. మరోవైపు వైఎస్ అభిషేక్ అమర్‌రహే అంటూ పలువురు నినాదాలు చేశారు. అంతిమయాత్రలో మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు సోదరుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇతర వైఎస్ కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు, వైఎస్ అభిషేక్‌రెడ్డి సన్నిహితులు వెంటరాగా భారీ జన సందోహం మధ్యతుది వీడ్కోలు పలికారు. సమాధుల తోటలో సంప్రదాయ బద్ధగా కార్యక్రమాలు నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు.



వైఎస్ అభిషేక్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

వైఎస్సార్ జిల్లా డీఈఓపై చర్యలు తీసుకోవాలి..

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక శోభకు గురి చేస్తున్న వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, ఎస్ఎల్‌టిఏ రాష్ట్ర అధ్యక్షులు అంకాల కొండయ్య , ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి , ఎన్సిసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వీ. సుబ్బారెడ్డిలు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు.

యువోత్సాహం..!

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న వైఎస్ఆర్ జిల్లా యువత
- ఏటా పార్లమెంట్‌లో ఉపన్యసించే అవకాశం



సానియా



దస్తగిరి బాషా



లోహిత్‌ఈశ్వర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: స్వామి వివేకానందుడు చూపిన మార్గంలో నడుస్తూ జిల్లాకు చెందిన యువత వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఏటా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా పార్లమెంటులో ప్రసంగించే అవకాశాన్ని మన జిల్లా నుంచి ఒకరికి దక్కుతుండటం విశేషం. 2002లో జిల్లాకు చెందిన రూపా, 2003లో అరుణ, 2004లో సానియాలు పాల్గొని పార్లమెంటులో ఉపన్యసించారు. దీంతోపాటు ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న నేషనల్ యూత్ డైలాగ్ కార్యక్రమానికి సైతం జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కడప నగరానికి చెందిన సానియా, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి చెందిన లోహిత్‌ఈశ్వర్ రెడ్డి, ప్రొద్దుటూరు దస్తగిరి బాషా ఎంపికయ్యారు.

వడ్డె ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

- డీఆర్‌ఓ మధుసూదన్ రావు



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్‌ఓ మధుసూదన్‌రావు

రాయచోటి: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జీవితం, ఉద్యమ పోరాటం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని నిర్వహించారు. డీఆర్‌ఓ, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి, వడ్డెర కుల సంఘం నాయకులు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా 1845 సంవత్సరంలో జరిగిన ఉద్యమంలో ఓబన్న కీలక పాత్ర పోషించారని డీఆర్‌ఓ తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి సైన్యాధ్యక్షుడిగా ఉంటూ ఎంతో సన్నిహితంగా మెలిగేవారని పేర్కొన్నారు. ఓబన్న చేసిన త్యాగాలు, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత విజయాలు సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమసాఖ అధికారి సురేష్ బాబు, వడ్డెర సంఘం నాయకులు ఓపీడీయర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి ఈశ్వర్, ఏపీ ఉద్యమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ జీవానందం, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న త్యాగాలు భావి తరాలకు స్ఫూర్తి దాయకమని రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

క్లుప్తంగా

11వ బెటాలియన్‌లో ఓబన్న జయంతి



ఓబన్న చిత్ర పటం వద్ద ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప

సిద్దవటం : స్థానిక భాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం వడ్డే ఓబన్న జయంతి నిర్వహించారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ నాగేశ్వరప్ప ఓబన్న చిత్ర పటానికి పూలమాలు వేసి గౌరవ వందనం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఓబన్న పోరాటం, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరు, స్వాతంత్ర్యం కోసం వారు ప్రాణాలర్పించడం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పీఎన్‌డీ.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌షాపు రాత పరీక్ష ఫలితాల విడుదల



అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న అభ్యర్థులు

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ సబ్‌డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో రేషన్‌షాపు ఖాళీలకు నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలను శనివారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ విడుదల చేశారు. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల వివరాలను కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె రెవెన్యూ సబ్‌డివిజన్‌లో 119 రేషన్‌షాపు ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. వాటిలో హైకోర్టు కేసుల కారణంగా 15 షాపులు, ఒక దరఖాస్తు అందని షాపులు 23 పోగా, మిగిలిన 81 షాపులకు సంబంధించి 709 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో స్క్రూటినీ అనంతరం డిసెంబర్ 31న బీటీ కళాశాలలో 367 మంది రాత పరీక్షకు అర్హత సాధించగా, 25 మంది పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. పరీక్ష రాసిన వారిలో 328 మంది పాసు మార్కులు సాధించగా, 8 మంది ఫెయిలయ్యారన్నారు. పరీక్ష తర్వాత ఆరుగురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో మొత్తం 251 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేశామని తెలిపారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..!

- జాగ్రత్తలతోనే సంతోషమయం కానున్న సంక్రాంతి
- ప్రయాణంలో నిర్లక్ష్యంగా ఉంటే అంతే సంగతులు
- ప్రజలకు పోలీసుల సూచనలు



రాజంపేట టౌన్ : సంక్రాంతి వేడుకలకు సమయం ఆసన్నమైంది. ఇక సోమవారం నుంచే వేడుకలు ప్రారంభం కానున్నాయి. దీంతో ప్రజలు సంక్రాంతి పండుగ బిజీలో ఉన్నారు. ఈ సందర్భంగా పరమపదించిన వారి ఫొటోల వద్ద కొత్త దుస్తులు, ఇష్టమైన ఆహార పదార్థాలు పెట్టడంతో పాటు సమాధుల వద్ద పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందువల్ల ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారు విధిగా తమ సొంతూళ్లకు వెళతారు. ఇందుకోసం రెండు నెలల ముందు నుంచే రైళ్లల్లో, బస్సుల్లో రిజర్వేషన్ చేయించుకుంటారు. కాగా విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వడంతో చాలా మంది సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లారు. ఇక ప్రైవేట్ సంస్థల్లో, కార్యాలయాల్లో పనిచేసే వారికి ఆదివారం సెలవు కావడంతో చాలా మంది స్వగ్రామాలకు పయనమయ్యేందుకు సర్వం సిద్ధం చేసుకొని ఉన్నారు. అయితే ఊర్లకు వెళ్లే వారు తమ ఇంటి విషయంలో, ప్రయాణంలో తగు జాగ్రత్తలు తీసుకుంటేనే సంక్రాంతి సంతోషమయం కాగలదని, లేకుంటే ఆభరణాలు, నగదు వంటివి దొంగలపాలవుతాయని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఇంటివద్ద ఇలాంటి జాగ్రత్తలు పాటించాలి

- ఊరికి వెళ్లే సమయంలో ఇంటిలోని అన్ని తలుపులకు తాళాలు వేసుకోవాలి.
- ప్రధానంగా ఇంటి ప్రధాన ద్వారానికి వేసే తాళం నాసిరకం కాకుండా చూసుకోవాలి.
- తాళం వేసినట్లు కనిపించకుండా కర్టన్ వేసి ఉంచాలి.
- ఇరుగు, పొరుగు వారికి తమ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పాలి. అలాగే రోజుకు ఒకటి, రెండుమార్లు తమ ఇంటి గురించి ఫోన్ చేసి తెలుసుకుంటూ ఉండాలి.
- వీలైతే నమ్మకమైన వ్యక్తులను రాత్రి వేళల్లో ఇంటిలో పడుకునే ఏర్పాటు చేసుకోవడం సురక్షితం.
- లాకర్‌లు ఉన్న వారు బంగారు ఆభరణాలను లాకర్‌లో భద్రపరుచుకోవడం శ్రేయస్కరం.
- ప్రస్తుతం మార్కెట్‌లో వైఫైతో కూడిన సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు మధ్య తరగతి ప్రజలకు కూడా అందుబాటులో ఉన్నాయి. అందరి వద్ద ఆండ్రాయిడ్ ఫోన్‌లు ఉన్నందున ఇంటివద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని ఫోన్‌కు అనుసంధానం చేసుకుంటే ఎప్పటికప్పుడు ఇంటిని పరిశీలించుకుంటూ ఉండవచ్చు.

ప్రయాణ సమయంలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- రైళ్లల్లో ప్రయాణించే వారు తమ లగేజీ బ్యాగులకు చైన్‌వేసి తాళం వేసుకోవాలి.
- రైల్వేస్టేషన్, బస్టాండుల్లో మంచినీళ్లకు, వాష్‌రూములకు వెళ్లే సమయంలో తెలియని వారికి ఎట్టి పరిస్థితుల్లో లగేజీ అప్పగించకూడదు.
- తోటి ప్రయాణికులు ఏవైనా తినుబండారాలు ఇచ్చినా సున్నితంగా తిరస్కరించాలి.
- బస్సులన్నీ రద్దీగా ఉంటాయి. బస్సు ఎక్కేటప్పుడు ముఖ్యంగా మహిళల మెడలో ఉండే బంగారాన్ని దొంగలు దొంగలిస్తారు. అందువల్ల మెడలోని నగలు కనిపించకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- ప్రయాణ సమయంలో బంగారు ఆభరణాలు తక్కువగా ధరించడం మంచిది. ప్రస్తుతం ఫోన్, గూగుల్‌పే, నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు ఉన్నందున ఎక్కువ మొత్తంలో డబ్బులు వెంట తీసుకెళ్లకూడదు.

అప్రమత్తతతోనే దొంగతనాల నివారణ



సంక్రాంతి సందర్భంగా చాలా మంది సొంత ఊళ్లకు వెళతారు. అందువల్ల ఊరికి వెళ్లేవారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే వారి ఇళ్లపై ప్రత్యేకంగా నిఘా వేసి ఉంచుతాం. సంక్రాంతి సందర్భంగా అన్ని ప్రాంతాల్లో గస్తీ పెంచుతాము. ప్రజల అప్రమత్తతతోనే దొంగతనాల నివారణ సాధ్యం కాగలదు.

– యల్లమరాజు, అర్బన్ సీఐ, రాజంపేట

కారు పల్టీ కొట్టి ఎనిమిది మందికి గాయాలు



పల్టీ కొట్టిన కారు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పోలిబుచ్చయ్యగారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కారు పల్టీ కొట్టిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం, తిప్పాయపల్లి గ్రామస్తులు వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లి పుల్లంపేటకు తిరుగు ప్రయాణమయ్యారు. మండల పరిధిలోని పోలుబుచ్చయ్యగారిపల్లి గ్రామం వద్ద షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంతో వస్తూ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఐదుగురు పెద్దలు, ముగ్గురు చిన్నపిల్లలకు గాయాలయ్యాయి. వీరిలో హిమబిందు (22) అనే మహిళ తలకు, కాలికి బలమైన రక్తగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసులు నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.



గాయపడిన వారిని 108 సహాయంతో కడప రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

కన్నబిడ్డలను కాటేసిన తండ్రి అరెస్టు



బోయకొండ (ఫైల్)

మదనపల్లె : కన్న కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడిన కసాయి తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ డి.కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లె దాసరిపేటకు చెందిన చెన్నూరుబోయకొండ(30) కూలి పనులకు వెళుతూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి భార్య చిట్టెమ్మ జీవనోపాధి కోసం ఊరురా తిరుగుతూ గాజులు విక్రయించేంది. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తల్లి ఇంటిపట్టున లేకపోవడంతో అమ్మమ్మ పిల్లల బాగోగులు చూసుకునేది. ఈనెల 6వ తేదీన బోయకొండ ఇద్దరు కూతుళ్ల కడుపునొప్పి తాళలేకపోతున్నామంటూ అమ్మమ్మ, మేనమామతో చెప్పుకున్నారు. వారు ఎందుకని ఆరా తీయగా, తండ్రి చేసిన అఘాయిత్యాన్ని వివరించారు. దీంతో వారు సమాచారాన్ని తల్లి చిట్టెమ్మకు తెలపడంతో ఆమె నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో భర్త బోయకొండపై ఫిర్యాదు చేసింది. రూరల్ సర్కిల్ సీఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ప్రాథమికంగా తండ్రి బోయకొండ బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు విచారణ చేశారు. నిందితుడు బోయకొండను శనివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

కాలువలో జారిపడి బాలుడి గల్లంతు



జస్వంత్ (ఫైల్)

రాజుపాళెం : అభం శుభం తెలియని ముగ్గురు పిల్లలు ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి అందులో ఒక బాలుడు గల్లంతైన సంఘటన రాజుపాళెం మండలంలోని పగిడాల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పగిడాల గ్రామానికి చెందిన పందిటి వెంకటయ్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటయ్య కుమారుడితో పాటు అతని అన్న కుమారులు, జస్వంత్ కలిసి ఆడుకుంటూ ఇంటి సమీపంలోని కేసీ చాపాడు కాలువలో జారి పడ్డారు. నీటిలో కొట్టుకు పోతున్న జస్వంత్ (9) ను కాపాడేందుకు మిగతా ఇద్దరు పిల్లలు శాయశక్తులా ప్రయత్నించినా దొరకలేదు. వెంటనే ఈ సమాచారాన్ని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు తెలియజేశారు. వారితో పాటు పోలీసులు, ప్రొద్దుటూరు ఫైర్ స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో కాలువలో గాలించారు. అయినా బాలుడి ఆచూకీ కనిపించలేదు. కాలువలో గల్లంతైన బాలుడు జస్వంత్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని కన్నేశ్వరి

రామసముద్రం : ఓ యువకుడి మాయలో పడి మొబైల్‌లో చాటింగ్ చేస్తుండగా గమనించిన తల్లి బాలికను మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని ఇంట్లో ఉన్న విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రామసముద్రం మండలంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, రాయల్పాడుకు చెందిన ఆదినారాయణ, సుకన్యలకు కన్నేశ్వరి(16), జ్యోతి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో భర్త తాగి బాధిస్తుండటంతో భర్తపై కోపంతో అలిగి పిల్లలతో కలిసి సుకన్య రామసముద్రంలోని బంధువుల ఇంటికి వచ్చేసి అద్దె ఇంట్లో ఉంటూ కుమార్తెలను కర్ణాటకలోని సోమయాజులపల్లెలో చదివించుకుంటోంది. పాఠశాలకు వెళ్తూ కన్నేశ్వరి అక్కడ ఓ యువకుడిమాయలో పడి చాటింగ్‌లు చేయడం, ఫోన్ మాట్లాడడం చేస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో బాలిక విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవీన్‌బాబుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న నవీన్ బాబు

కడప కోటిరెడ్డి సర్కిల్ : బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లి గ్రామానికి చెందిన రైల్వే తపాలా ఉద్యోగి జి.నవీన్ బాబుకు రైల్వే మెయిల్ సర్వీస్ క్యాటగిరిలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ వారు రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించిన తపాలా జీవిత బీమా ప్రత్యేక డ్రైవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తపాలా ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడలో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోస్టల్ సర్వీసెస్ బోర్డు మెంబర్ కె.ప్రకాష్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. నవీన్ బాబును పలువురు రైల్వే అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

పండక్కి ఊరికి వస్తానంటివే.!

- గోడ కూలి హిటాచీ డ్రైవర్ దుర్మరణం
- స్పిన్నింగ్‌మిల్లు పాత భవనాలను కూలదోస్తుండగా ఘటన
- పనిచేస్తున్న వాహనంలోనే పోయిన ప్రాణం



హిటాచీలో గోడ శిథిలాల మధ్య రక్తమోడుతున్న డ్రైవర్ రమేష్‌రెడ్డి మృతదేహం



ప్రమాదానికి కారణమైన హిటాచీ వాహనం



రమేష్‌రెడ్డి, ప్రవీణ దంపతులు(ఫైల్)



మార్చురీ వద్ద రోదిస్తున్న భార్య, పిల్లలు

మదనపల్లె : ఈరోజు పనిచూసుకుని పండక్కి ఇంటికి వచ్చేస్తానమ్మా.. అమ్మను ఇబ్బంది పెట్టకండి. చక్కగా చదువుకోండి. వచ్చేటప్పుడు మీకు కావాల్సినవి తీసుకువస్తా అని చెప్పిన మా నాన్న ఎందుకు చనిపోయాడు అంటూ పిల్లలు ఏడుస్తున్న తీరు ప్రభుత్వాసుపత్రిలో పలువురిని కలచివేసింది. మదనపల్లె మండలం సీటీఎం స్పిన్నింగ్ మిల్లులో పాత భవనాలను తొలగిస్తుండగా, ప్రమాదవశాత్తు భవనం గోడ హిటాచీ వాహనం మీద పడి డ్రైవర్ వాహనంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం జరిగింది. గోడ ఒక్కసారిగా వాహనం మీద పడటంతో డ్రైవర్ శరీరం వాహనంలో ఇరుక్కుపోయి రక్తసిక్తమైంది. వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం కుమారునిపల్లెకు చెందిన నారాయణరెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు ఎస్.రమేష్ రెడ్డి(40) హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉపాధి నిమిత్తం కదిరి పట్టణం అడపాలవీధి పంచాయతీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్నాడు. ఇతనికి భార్య ప్రవీణ, కుమార్తెలు సాహితి(13), భవ్యశ్రీ(11), కుమారుడు రోచన్‌రెడ్డి(4) ఉన్నారు. స్థానికుడైన ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ యజమాని, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వద్ద 15 ఏళ్లుగా రమేష్‌రెడ్డి హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండునెలల క్రితం సీటీఎం స్పిన్నింగ్ మిల్లు భవనాల తొలగింపు, చదును పనుల కోసం రమేష్‌రెడ్డి ఇక్కడకు వచ్చి పని చేస్తున్నాడు. పనులు దాదాపు చివరిదశకు చేరుకున్నాయి. కేవలం ఐదురోజుల పని మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలో శనివారం పనిచేసి, పండుగకు ఇంటికి వస్తానని రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుక్రవారం రాత్రి ఫోన్ చేసి చెప్పాడు. అయితే శనివారం ఉదయం హిటాచీతో స్పిన్నింగ్ మిల్లులోని పాత భవనాన్ని తొలగిస్తుండగా, శిథిల స్థితిలో ఉన్న పెద్దగోడ అటువైపు పడుతుందనే ఆలోచనతో, హిటాచీతో నెట్టుతుండగా, ప్రమాదవశాత్తు వాహనం మీద పడిపోయింది. డ్రైవర్ సీటులో ఉన్న రమేష్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం పాలై గోడ శిథిలాల కింద చిక్కుకుపోయి రక్తమోడుతూ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. ప్రమాదంలో హిటాచీ వాహనం ధ్వంసమైంది. గమనించిన తోటిపనివారు పోలీసులకు, కాంట్రాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, పోలీస్ సిబ్బంది, స్థానికుల సహాయంతో శిథిలాలను తొలగించి, వాహనంలో ఇరుక్కుపోయిన రమేష్‌రెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన వివరాలను అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రమేష్ రెడ్డి భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని రమేష్ రెడ్డి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యజమాని గుర్తుపట్టలేని స్థితిలో శవమై పడి ఉండటాన్ని చూసిన భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఊటుకూరు వద్ద లారీ, ఐచర్ వాహనం ఢీ

– హైవేలో స్తంభించిన ట్రాఫిక్



ఐచర్ వాహనం, లారీ ఢీ కొన్న దృశ్యం

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని ఊటుకూరు వద్ద శనివారం లారీ, ఐచర్ వాహనం ఢీ కొన్నాయి. ఐచర్ వాహనం నుజ్జునుజ్జు అయింది. డ్రైవర్ ఎం.రాము(బనగానపల్లె, నంద్యాల జిల్లా) ఇరుక్కుపోయారు. ట్రాక్టర్ సాయంతో సురక్షితంగా డ్రైవర్‌ను బయటికి తీశారు. లారీ డ్రైవర్ షేక్ బందగిరీ (గుల్బర్గా, కర్ణాటక) కూడా గాయపడ్డాడు. రహదారిపై ప్రమాదం జరగడంతో వాహనాలు బారులు తీరాయి. కిలోమీటర్ మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందెం ఆటగాళ్ల అరెస్టు

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీ నగిరిలో శనివారం కోడిపందెం ఆడుతుండగా ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాసులు దాడి నిర్వహించారు. నాలుగు కోళ్లు, రెండు కోడి కత్తులు, రూ. 20,100లు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలో రేషన్ షాపు చిచ్చు

రైల్వేకోడూరు అర్బన్ : ఓబులవారిపల్లి మండలం గాదెల వెంకటాపురం రేషన్ షాపు కేటాయింపు వ్యవహారం టీడీపీలో చిచ్చురేపింది. గత టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడుకు చెందిన టీడీపీ కార్యాలయంలో ఓబులవారిపల్లి మాజీ జెడ్పీటీసీ నాయుడోరి రమణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డిపై ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు రేషన్‌షాపు కేటాయించారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి ఏజెంట్‌గా ఉన్న చిన్నరెడ్డయ్యకు రేషన్ షాపు ఇప్పించి టీడీపీ కార్యకర్త అయిన ఆదినారాయణకు ద్రోహం చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని ప్రశ్నించారు.

టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోండి

రాయచోటి టాస్క్‌ఫోర్స్ : తనను, తన భర్తను బెదిరిస్తున్న రైల్వేకోడూరుకు చెందిన టీడీపీ నాయకుడు కాకర్ల రవికుమార్ చౌదరిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి శనివారం అబ్బూరి అనిత ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ తమ జాగాలో కార్ పార్కింగ్‌కు స్థలం బాడుగకు ఇస్తుంటే కారు ఓనర్లను, తన భర్తను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆయనకు మద్దతు తెలుపుతున్న సీఐ హేమ సుందర్ రావుపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సీఐకు బంధువు కావడం వల్ల అందరినీ బెదిరిస్తున్నాడని తెలిపారు.

మెలకువలతో ఆరోగ్యకరమైన లేగదూడలు

వల్లూరు (చెన్నూరు) : లేగదూడలను పెంచడంలో మెలకువలు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన లేగదూడలు పెరుగుతాయని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. మండలంలోని నరసారెడ్డిపల్లెలో శనివారం డీపీఎల్ డీపీ కడప వారి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాడి రైతులు లేగ దూడల పెంపకంలో మెలుకువలు పాటించినట్లయితే దూడలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న 42 దూడలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులురెడ్డి, డీపీఎల్‌డీపీ డాక్టర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రవాణాశాఖ అధికారులు పలు ప్రైవేట్ ట్రావెల్స్‌పై శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. పర్మిట్ లేకుండా తిరుగుతున్న రెండు ట్రావెల్స్‌కు రూ. 5.24 లక్షలు జరిమానా విధించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా చేస్తున్న రెండు బస్సులకు రూ. 20 వేలు, ఎఫ్‌సీ లేని మరో బస్సుకు రూ. 5 వేలు జరిమానా విధించినట్లు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక శనివారం కడపలో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా జె.ప్రభుదాస్, అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్.రవిశేఖర్, ఉపాధ్యక్షులుగా పి.ఉదయశంకర్‌రెడ్డి, ఎన్.తిరుపతిస్వామి, డి.రబియాబేగం, కార్యదర్శిగా ఎ.ఉదయకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జె.ధీరజ్, జాయింట్ సెక్రటరీలుగా పి.ఉదయ నరసింహా, ఎన్.పవన్‌కుమార్, ఆర్ఎల్‌వీ మనోజ్ఞ, ట్రెజరర్‌గా హరహరపుత్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.గోపాల్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఓ.సాయికుమార్, పరిశీలకునిగా పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

దువ్వూరు : హైవే రోడ్డుపై ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలం గొడిగనూరు గ్రామానికి చెందిన ఇంద్ల కుమార్ రాజా వీ5 విలేకరిగా చెప్పుకుని మండలంలోని ఇడమడక గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నాడన్నారు. ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.5వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దువ్వూరు వై జంక్షన్‌లో శనివారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.